క్లుప్తంగా

సమస్యాత్మక కేంద్రాలపై పరిశీలకుడి సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి, పోలీస్ అబ్జర్వర్ చంద్రకాంత్

మండపేట: స్థానిక అసెంబ్లీ నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, సమస్యాత్మక గ్రామాల్లోని పరిస్థితులను ఎన్నికల పోలీసు పరిశీలకుడు ఎంవీ చంద్రకాంత్ మంగళవారం సమీక్షించారు. పట్టణంలోని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో డీఎస్పీ రామకృష్ణ, టౌన్, రూరల్ సీఐలు షేక్ అఖిల్ జమ, కొమ్ముల శ్రీధర్‌కుమార్, మండపేట నియోజకవర్గ ఎన్నికల రిటరినింగ్ అధికారి డీవీఎస్ ఎల్లారావు, ఎస్సైలు పాల్గొన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను చంద్రకాంత్ వారికి వివరించారు. మే 13న జరిగే పోలింగ్‌కు జిల్లా వ్యాప్తంగా పోలీసు భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడా అల్లర్లు, ఘర్షణలు జరగకుండా ప్రత్యేక బలగాలను కూడా జిల్లా అంతటా మొహరించామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. తొలుత పట్టణంలోని సమస్యాత్మక కేంద్రాలను చంద్రకాంత్ పరిశీలించారు. పటేల్ స్కూల్, మారేడుబాకలోని సమస్యాత్మక కేంద్రాలను పరిశీలించారు.

'తోట'కు మద్దతుగా ఏడిదలో ప్రచారం



ఏడిదలో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని ఏడిద పంచాయతీ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం ఆ గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పలివెల సుధాకర్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, ఎంపీటీసీ సభ్యుడు పట్నాల నాగబాబు, వాసిరెడ్డి అర్జున్, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి శ్రీహరి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రామకృష్ణ తదితరులతో కలిసి గ్రామంలో పర్యటించారు. యర్ర నూతి సెంటర్ నుంచి వారు ఎన్నికల ప్రచారం చేపట్టారు. చుట్టు పక్కల వీధుల్లో ప్రజలను కలసి తోట త్రిమూర్తులుకు ఓటు వేసి ఘన విజయం అందించాలని అభ్యర్థించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.మండపేట నుంచి పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు ఘన విజయాన్ని అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఎంపీటీసీ సభ్యుడు తాతపూడి ఉషా రాజేష్, ముగ్గుళ్ల పార్థకృష్ణ, రామిశెట్టి ఫణి, పితాని నారాయణరావు, చంద్రమళ్ల బులివీరయ్య, గెద్దాడ ఏడుకొండలు, పవ్వల సూర్యనారాయణ, కొండపల్లి ఏవీరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుమారు 70 మంది రక్తదానం

మండపేట: పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం, అమ్మ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్త ఇమ్మిడిశెట్టి నాగభూషణం ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. సుమారు 70 మంది రక్తదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం, అమ్మ ఫౌండేషన్‌లు పట్టణంలో అందిస్తున్న ఎనలేనివని కొనియాడారు.

వందసార్లు రక్తదానం చేసిన షేక్ వలీ

కడియం మండలం మురమండకు చెందిన షేక్ వలీ మంగళవారం వందో సారి ఈ శిబిరంలో రక్తదానం చేశారు.ఈ సందర్భంగా వలీని నాగభూషణం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

సందీప్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

కొత్తపేట: సందీప్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని పిల్లల వైద్య నిపుణుడు కె.శ్రీమన్నారాయణ, కంటి వైద్య నిపుణుడు గంధం రామారావు అన్నారు. వాడపాలెంలో వైద్య విద్యార్థి బండారు సందీప్ 36 జయంతిని పురస్కరించుకుని సందీప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బండారు పెదవెర్రియ్య (చిట్టిబాబు)-సత్యవేణి దంపతుల ఆధ్వర్యంలో సందీప్ వైద్య, సేవా భవనం వద్ద మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యులు శ్రీమన్నారాయణ, వీఎస్ఎస్ఎన్ మూర్తి, గంధం రామారావు, సూర్యనారాయణ మూర్తి, కడి రమేష్, కేవీ రమణకుమార్, వయ్యాపుల సురేష్‌బాబు, పీజీ ఖాసిమ్‌ఖాన్, జి.దీపక్‌చక్రవర్తి, గణాధిపతి, మెంటే ఉదయభాస్కరరావు సేవలందించారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి చెందిన టెక్నీషియన్లు సుమారు 120 మందికి పరీక్షలు చేసి 20 మందిని ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. వానపల్లి ఆర్‌కే డయోగ్నోస్టిక్ సెంటర్ వారు 171 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించారు.

సరికొత్తగా లిఖించబడి

- కార్పొరేట్‌కు దీటుగా సర్కారు పాఠశాలలు
- 'నాడు- నేడు'తో సమగ్రాభివృద్ధి
- పేదల విద్యకు సీఎం జగన్ పెద్దపీట



నరసాపురపుపేట హైస్కూల్‌లో మినరల్ వాటర్ ప్లాంట్



సుందరంగా రామచంద్రపురం మండలం నరసాపురపుపేట హైస్కూల్

రామచంద్రపురం: సర్కారు బడులకు సరికొత్త రూపు వచ్చింది.. సర్వాంగ సుందరంగా మారింది.. బడి పిల్లలను రా రమ్మని ఆహ్వానిస్తోంది.. సీఎం జగన్ సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సరికొత్త అధ్యాయం లిఖించింది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మనబడి 'నాడు- నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మార్చింది. ఆధునీకరణలో అన్ని పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించింది. నియోజకవర్గంలోని రామచంద్రపురం అర్బన్, రూరల్‌లో 86, కె.గంగవరంలో 76, కాజులూరులో 79 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 'నాడు- నేడు' ద్వారా అర్బన్ రూరల్‌లో 65, కె.గంగవరంలో 49, కాజులూరులో 72 పాఠశాలలను ఆధునీకరించారు. తరగతి గదుల్లో గాలి, వెలుతురు ఉండటంతో పాటు, విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండే డెస్కులు, బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ఫ్యాన్‌లు అమర్చారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ద్వారా బ్యాగులు, బూట్లు, సాక్స్‌లు, నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, ఇంగ్లిషు డిక్షనరీలు, వర్క్ బుక్స్, యూనిఫాం, బెల్ట్‌లను ఇచ్చారు. దీంతో పాటు పాఠశాలలో రక్షిత మంచినీటి కోసం ఆర్వో ప్లాంటులను ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో చైతన్యం కలిగించేందుకు గోడలపైన వివిధ రకాల దేశ నాయకుల చిత్రాలతోపాటు వివిధ బొమ్మలను కూడా పెయింటింగ్ వేయించారు. పాఠశాల ఆవరణాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేశారు. అత్యాధునిక మరుగుదొడ్లు, నిత్యం అందులో వాటర్ వచ్చే విధంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

మండలం	'నాడు- నేడు'లో ఖర్చు
కె.గంగవరం	రూ. 14.20 కోట్లు
రామచంద్రపురం రూరల్, అర్బన్	రూ. 10.32 కోట్లు
కాజులూరు	రూ. 11.76 కోట్లు
మండలం	**మొత్తం విద్యార్థులు**
కె.గంగవరం	5,642
రామచంద్రపురం రూరల్, అర్బన్	7,995
కాజులూరు	7,768
మండలం	**2018–19లో విద్యార్థులు**
కె.గంగవరం	4,353
రామచంద్రపురం రూరల్, అర్బన్	6,680
కాజులూరు	6,428
మండలం	**పెరిగిన విద్యార్థులు**
కె.గంగవరం	1,289
రామచంద్రపురం రూరల్, అర్బన్	1,315
కాజులూరు	1,340



స్కూల్‌లో విద్యార్థులు కూర్చునేందుకు ఆధునిక బెంచీలు

వెల్లలో పంటకోత ప్రయోగం



వెల్లలో పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: వెల్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన పంట కోత ప్రయోగంలో ఎకరాకు 53 బస్తాల దిగుబడి వచ్చిందని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ తెలిపారు. గ్రామంలోని మాధవరపు వెంకటరాజు పొలంలో నిర్వహించిన వరి పంట కోత ప్రయోగంలో 75 కిలోల బస్తాలు 53 బస్తాల దిగుబడి వచ్చిందన్నారు. మండలంలో దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. ప్రస్తుతానికి 9,600 ఎకరాల్లో పంట కోతలు జరిగాయని, వచ్చే మే నెల 10వ తేదీ నాటికి మండలంలో పంట కోతలు పూర్తి కావచ్చని తెలిపారు. వీఏఏ పి.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

వ్యాపారాల వృద్ధికే రాజకీయాల్లోకి వేగుళ్ల



ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు

- ఆయనకు ప్రజాసేవ చేసే ఉద్దేశం లేదు
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు
- తాపేశ్వరం, అర్తమూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

మండపేట: తన వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికే ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు రాజకీయాల్లోకి వచ్చారు తప్ప, ప్రజలకు సేవ చేయడానికి కాదని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు విమర్శించారు. మంగళవారం తాపేశ్వరం, అర్తమూరు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్‌గా రాజకీయాల్లోకి వచ్చిన వేగుళ్ల జోగేశ్వరరావు పట్టణంలో స్థలాల గురించి, లే అవుట్‌ల గురించి అవగాహన పెంచుకున్నారన్నారు. గత 20 ఏళ్లుగా తన లే అవుట్ల వ్యాపారాన్ని తన పదవిని అడ్డుపెట్టుకుని మూడు పువ్వులు ఆరు కాయలుగా వృద్ధి చేసుకున్నారన్నారు. డబ్బు, పదవీ కాంక్ష వున్న జోగేశ్వరరావు తన పదవీ కాలంలో పేదలకు ఒక్క పైసా కూడా మేలు చేయలేదన్నారు. ఒక్క సెంటు భూమిని కూడా ఇళ్ల స్థలంగా పేదలకు పంచ లేదన్నారు. తోట త్రిమూర్తులు తొలుత తాపేశ్వరంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం మెయిన్ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, బైక్ ర్యాలీకి శ్రీకారం చుట్టారు. దేవుడు కాలనీ, మరిడమ్మపేట, ఎస్సీ పేట మీదుగా సాగిన ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా తిరిగి పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుంది. అడుగడుగునా తోటకు మహిళలు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. తమ కుటుంబాలన్నీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తోట త్రిమూర్తులును గెలిపిస్తామని వారు భరోసా ఇచ్చారు. రెండు ఓట్లు కూడా ఫ్యాన్ గుర్తుకు వేసి తనను, ఎంపీ రాపాక వరప్రసాదరావును అఖండ మెజారిటీతో గెలిపించాలని తోట త్రిమూర్తులు కోరారు. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యురాలు కుడుపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, అర్తమూరు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు నాగిరెడ్డి రాంబాబు, గొలుగూరి విజయభాస్కరరెడ్డి, ఎంపీటీసీ పిల్ల సత్తిబాబు, పంపన లక్ష్మీ పద్మారావు, అడవి కుమార్, చిర్ల జయరామ్‌రెడ్డి, గొలుగూరి సందీప్ రెడ్డి, గ్రంధి సూరి పండు, దాసరి లాజర్, బూర చిన్న, డి. కరుణ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ శ్రేణుల బైక్ ర్యాలీ సందడి

తండ్రికి మద్దతుగా పృథ్వీరాజ్ ప్రచారం



మండపేట 29 వ వార్డులో ప్రచారం చేస్తున్న పృథ్వీరాజ్, వైఎస్సార్ సీపీ శ్రేణులు



రాయవరం ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ యువ నేత పృథ్వీరాజ్ తదితరులు

మండపేట: వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు మద్దతుగా ఆయన కుమారుడు, పార్టీ యువ నేత మంగళవారం పట్టణంలోని 29వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, పార్టీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు ఆధ్వర్యంలో ఈ ప్రచారం సాగింది. పృథ్వీరాజ్ పార్టీ శ్రేణులతో కలసి సత్యశ్రీ రోడ్డు, సప్తగిరి రోడ్ల పక్కన ఉన్న అన్ని వీధుల్లో పర్యటించారు. ఈ ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని పృథ్వీరాజ్ కోరారు. అలాగే తన తండ్రి తోట త్రిమూర్తులును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజబాబు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు మీగడ శ్రీనివాస్, షేక్ అలీఖాన్‌బాబా, కౌన్సిలర్లు మెండు భవాని, పోతంశెట్టి ప్రసాద్, మెండు బాపిరాజు, మారిశెట్టి సత్యనారాయణ, జొన్నపల్లి సత్తిబాబు, జిన్నూరి సత్యసాయిబాబా, రెడ్డి రత్తయ్య, అధికారి శ్రీను, యాళ్ల శ్రీను, కేవీ రమణ, ఈలి తాతాజీ, మీసాల రమణ, దాసరి సత్యనారాయణ, పంపన శ్రీనివాస్, పాలమాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ లబ్ధి

రాయవరం: వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని ఆ పార్టీ యువ నేత తోట పృథ్వీరాజ్ అన్నారు. రాయవరంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పృథ్వీరాజ్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజలు ప్రస్తుత ప్రభుత్వ పాలనను, గత టీడీపీ ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకుని తేడాను గమనించాలన్నారు. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటేనే ఓటు వేయండని కోరుతున్న దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ గంటి రోజా, దేవస్థానం చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి తదితరులు మాట్లాడుతూ అభివృద్ధి కాముకుడు, పిలిస్తే పలికే నాయకుడు, ప్రజల కష్టాల్లో తోడుగా నిలిచే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు, అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి రాపాక వరప్రసాదరావులకు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని కోరారు. రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీకి అఖండ మెజార్టీని అందించాలన్నారు. పోలిమాటి సుధాకర్, పార్టీ నాయకులు తాడి రామచంద్రారెడ్డి, పడాల కమలారెడ్డి, అద్దూరి పెదసూరిబాబు,మండపల్లి కొండలరావు, జానకయ్య, బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

మండపేట: శ్రీరామ నవమి ఉత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా పట్టణ టైలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కేపీ రోడ్డులోని బంగారు షాపుల వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. 103 ఏళ్ల చరిత్ర ఉన్న టైలర్స్ సంక్షేమ సంఘం ఏటా ఘనంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తోందని ఆ సంఘం పట్టణ శాఖ అధ్యక్షుడు రేకపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం 2200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీఎస్ మూర్తి, వింజరపు శ్రీనివాస్, బీరక సాంబశివరావు, హరిపిరాల నారాయణరావు, వేమగిరి శ్యామ్, తూతిక వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

విజయ కిరీటం వైఎస్సార్ సీపీకే..

- ధర్మయుద్ధంలో గెలుపు మనదే
- ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్



అయితపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్

కాజులూరు: రానున్న ధర్మయుద్ధంలో వైఎస్సార్ సీపీకే మరోసారి విజయం ఖాయమని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మంగళవారం మండలంలోని అయితపూడి, అంద్రంగిలలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తొలుత ఆయనకు స్థానికులు, మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వంలో పేదలకు ఎన్నో రకాలుగా మేలు జరిగిందన్నారు. దళారుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఇంటికే సంక్షేమం దరిచేరిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని శాఖల అధికారులు స్థానికంగానే అందుబాటులోకి రావడంతో పనులు సులభతరం అయ్యాయన్నారు. గతంలో పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫార్సులు ఉండాల్సి వచ్చేదన్నారు. జగనన్న పాలనలో నిజమైన అర్హులకు వలంటీర్ల ద్వారా పథకాల లబ్ధి అందుతుందన్నారు. చక్కని పాలన నిరంతరం సాగాలంటే రాష్ట్రానికి జగనే తిరిగి సీఎం కావాలన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోను జగన్ తూచా తప్పకుండా అమలు చేశారని, 2014లో టీడీపీ ప్రకటించిన హామీలను తుంగలోకి తొక్కిందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలంటూ మరోమారు ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు చూస్తున్నారన్నారు. ఎంపీపీ మాత భారతి, మాత మురళి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, మాజీ సర్పంచ్ రాయపురెడ్డి సత్తిబాబు, కంచి ఏసునందం, పెంకే భీమన్న, దొరబాబు, యాళ్ల సత్తిబాబు, యాళ్ల నరసింహమూర్తి, కాదా నాగరాజు పాల్గొన్నారు.

ఏ ఆపద వచ్చినా ముందుంటా..

రామచంద్రపురం: ఏ ఆపద వచ్చినా ముందుంటానని, తనను ఆశీర్వదించాలంటూ ఆటో డ్రైవర్లతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. స్థానిక ప్రసన్న విఘ్నేశ్వర ఫంక్షన్ హాల్ వద్ద పట్టణంలోని ఆటో యూనియన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆటోడ్రైవర్ల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా తిరిగి ఎన్నుకుందామని పిలుపునిచ్చారు. ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ సూర్యప్రకాశ్‌కు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ అత్యధిక మెజారీతో ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని ప్రకటించారు. పట్టణ ఆటో యూనియన్ సంఘాల అధ్యక్షులు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐల బృందం ప్రచారం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ ఆయన స్నేహితులు, వివిధ దేశాల్లో ఐటీ రంగంలో ఉద్యోగాలు చేస్తున్న వారు నియోజకవర్గంలో ప్రచారం చేశారు. ఎన్‌ఆర్‌ఐ ఐటీ ఉద్యోగులు సుంకిరెడ్డి గణేష్, సూర్యప్రకాశ్, అనంత్, ప్రేమ్‌కుమార్‌లు సూర్యప్రకాశ్‌ను ఎన్నికల కార్యాలయంలో కలసి తమ మద్దతు తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ఓటువేసి సూర్యప్రకాశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, తాము నియోజవకర్గంలో పలు గ్రామాల్లో పర్యటిస్తున్నామన్నారు. కాజులూరు మండలం పల్లిపాలెం, కె.గంగవరం మండలం శివల తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశామన్నారు.



ఆటో యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్ తదితరులు

ప్రచార జోరు.. అదే హుషారు

- దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ
- అడుగడుగునా జన నీరాజనం

రామచంద్రపురం: ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ దూసుకుపోతోంది.. స్థానిక 14వ వార్డు పరిధిలో ఆ పార్టీ నేతలు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థి సూర్యప్రకాష్‌ను అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్న తిరిగి సీఎం కావాలని అన్నారు. వలంటీర్లు ఇంటింటికీ రావాలన్నా.. నవరత్న పథకాలు ఇంటికి తేవాలన్నా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు వాడ్రేవు సాయిప్రసాద్, బాసిన నాగమణి, పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, పాకలపాటి గోపి, పాటి ప్రసాద్, బాసిన కిరణ్‌కుమార్, కొండపల్లి రాఘవ పాల్గొన్నారు. సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన వస్తుందని వైఎస్సార్ సీపీ అభ్యర్థి సూర్యప్రకాశ్ సతీమణి దివ్యశ్రీ అన్నారు. పట్టణంలోని 15వ వార్డు పరిధిలో ఆమె ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సూర్యప్రకాష్‌ను గెలిపించాలని కోరారు. పట్టణ పార్టీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు పోతంశెట్టి వెంకటశ్యామలత, పెంటపాటి దేవి తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న దివ్యశ్రీ తదితరులు

సూర్యప్రకాశ్ గెలుపు ఖాయం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఇందుకూరి నరసింహరాజు అన్నారు. హసన్‌బాదలో ఎంపీ బోస్, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌లను ఆయన కలసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పాలన, నియోజకవర్గంలో మచ్చలేని ఎంపీ బోస్ రాజకీయ నేపథ్యం సూర్యప్రకాశ్ అఖండ విజయానికి దోహదపడుతుందని అన్నారు. నాయకులు కుడుపూడి రాంబాబు, ముదునూరి రామరాజు, రెడ్డి రత్నం, గుబ్బల శ్రీకృష్ణ, చింతాకుల సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



14వ వార్డులో ప్రచారం చేస్తున్న చైర్ పర్సన్ శ్రీదేవి తదితరులు

శ్రమయేరా అన్నిటికీ మూలం..



అంగరలో భవన నిర్మాణ పనిలో శ్రమిస్తున్న తాపీమేస్త్రీలు, కూలీలు (ఫైల్)

- రెండు నియోజవర్గాల్లో విస్తారంగా శ్రామిక శక్తి
- ఇతర ప్రాంతాల అభివృద్ధికి ఊతమిస్తున్న కార్మికులు
- అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా...

కపిలేశ్వరపురం: కార్మిక, కర్షకులు సమాజ గమనానికి రథ చక్రాలు. వారి శ్రమయే యావత్ మానవాళికీ మూలం. సామాజిక ఉత్పత్తిలో వారి పాత్ర కీలకం. వినియోగించే ప్రతి వస్తువు, సౌకర్యాల్లో వారి శ్రమ శక్తి దాగి ఉంది. ఆధునిక యంత్రాలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం సైతం మానవ మానసిక శ్రమ శక్తే. శ్రమ ప్రాధాన్యతను గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 58 నెలల పాలనా కాలంలో అసంఘటిత రంగ శ్రామికులకు విశేషంగా సంక్షేమ పథకాలను అమలు చేసింది. నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ఈ కథనం...

రెండు నియోజకవర్గాల్లో శ్రామిక శక్తి ఇలా...

మండపేట పరిసర గ్రామాల్లో 120 పైగా రైస్ మిల్లులు, రెండు పేపర్ మిల్లులు, మూడు ఆయిల్ ఫ్యాక్టరీల్లో వేలాది మంది కార్మికులు ఉత్పత్తిలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. రామచంద్రపురంలో ఆర్బోస్ ఫ్యాక్టరీతో పాటు పలు రవాణా రంగ ఇంజినీరింగ్ ఖార్ఖానాలు మనుగడలో ఉన్నాయి. కె.గంగవరం మండలంలో హెరిటేజ్ పాల పదార్థాల సంస్థ, మండపేట నియోజకవర్గంలో సుమారు 300 ఇటుక బట్టీల్లో మూడు వేల మంది వలస కార్మికులు శ్రమిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో సుమారుగా 505 అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 1000 మంది అంగన్‌వాడీలు, 68,873 మంది ఉపాధి కూలీలున్నారు. 99,583 ఎకరాల్లో వేలాది మంది రైతు, వ్యవసాయ కూలీలు శ్రమ చేస్తున్నారు. శ్రమశక్తి సంఘాల్లోని 80 వేల మంది శ్రమశక్తి సంఘాల సభ్యులకు వందలాది మంది యానిమేటర్లు సేవలందిస్తున్నారు. 119 గ్రామాలు, రెండు పట్టణాల పరిధిలో పారిశుధ్య, ఇతర విభాగాల కార్మికులు, 23 పీహెచ్‌సీలు, పలు సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రిల పరిధిలో వందల మంది వైద్య ఉద్యోగులు, సిబ్బంది, రామచంద్రపురం, మండపేట, కపిలేశ్వరపురం ప్రాంతాలకు చెందిన తాపీమేస్త్రీలు విశేషంగా శ్రమిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేయూత

2019 సెప్టెంబర్‌లో ఆర్టీసీని ప్రభుత్వం రంగంలో విలీనం చేసింది. ఆటో కార్మికులకు, బోటు ఉన్న మత్స్యకార కుటుంబానికి రూ.10 వేలు చొప్పున, మగ్గం ఉన్న చేనేత కార్మిక కుటుంబానికి రూ.24 వేలు ఏడాదికి ఆర్థికసాయం అందిస్తుంది. అంగన్‌వాడీలకు రూ.7 వేల నుంచి రూ.10 వేలకు, ఆశ వర్కర్లుకు రూ.3 వేల నుంచి 10 వేలకు వేతనాలను పెంచింది. మండపేట పట్టణంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసింది. మున్సిపాల్టీలలోని కార్మికుల వేతనాలను రూ.18వేలకు పెంచేందుకు నిర్ణయించింది.